డంపింగ్‌యార్డులా 100 ఫీట్ రోడ్



రోడ్డు పక్కనే వేసిన వ్యర్థాలు

- రోడ్డు పక్కనే పేరుకుపోయిన వ్యర్థాలు
- నీరుగారుతున్న లక్ష్యం

రాజమహేంద్రవరం రూరల్: ప్రజల సౌకర్యార్థం నగరపాలక సంస్థ అధికారులు సుందరంగా తీర్చిదిద్దిన 100 ఫీట్ రోడ్డు డంపింగ్‌యార్డులా మారుతోంది. ఈ రోడ్డు పక్కనే వ్యర్థాలను, పాత బిల్డింగ్ మెటీరియల్‌ను తీసుకువచ్చి పడేస్తున్నారు. దీంతో పాలకుల లక్ష్యం నీరుగారిపోతోంది. నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా ప్రజలు చెత్తా చెదారాలను రోడ్డు పక్కనే వేస్తున్నారు.

వివరాలు ఇవీ..

ఎంపీ మార్గాని భరత్‌రామ్ చొరవతో నగరపాలక సంస్థ అధికారులు మోరంపూడి జాతీయ రహదారి నుంచి ఆవ వాంబేకాలనీ వరకూ రూ.లక్షలతో 100 ఫీట్ రోడ్డు నిర్మించారు. దీనిని మూడు నెలల క్రితం ప్రారంభించారు. మోరంపూడి ఫ్లైఓవర్ పనులు జరుగుతుండడంతో ఈ రోడ్డు మీదుగానే నగరంలోనికి వెళ్లే వివిధ ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మరో పక్క వాకర్లు, స్కేటింగ్ చిన్నారులకు ఈ రోడ్డు ఎంతో అనుకూలంగా ఉంటోంది. ఫొటోషూట్‌లకు, షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరణలు కూడా ఇక్కడ ఎక్కువగానే జరుగుతున్నాయి.



నగరంలోని 100 ఫీట్ రోడ్డు

తీవ్ర ఇబ్బందులు

ఇటువంటి రోడ్డును ఎంతో పరిశుభ్రంగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అయితే కొందరు చెత్తా చెదారాలు, బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్స్‌ను తీసుకువచ్చి డంపింగ్‌యార్డుగా మార్చేస్తున్నారు. దీనివల్ల వాహనచోదకులతో పాటూ వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసిన చెత్తకు మంటపెట్టడం వల్ల పొగతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఒక ప్రాంతంలో మొదలు పెట్టారు. ఇలా వదిలేస్తే రోడ్డు శివారు వరకూ వ్యర్థాలను వేసుకుంటూ వెళ్లిపోతారు. రోడ్డుకు ఇరువైపులా నగరపాలకసంస్థ అధికారులు మొక్కలను సైతం నాటారు. వాటిపై కూడా చెత్తను పడవేస్తున్నారు.

క్లుప్తంగా

ఆహార భద్రత పాటించకపోతే చర్యలు



తనిఖీ చేస్తున్న అనంతరావు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ఆహార తయారీ సంస్థలు, రెస్టారెంట్లు, బేకరీలు తప్పనిసరిగా ఫుడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఆహార భద్రతా నియమాలు పాటించాలని రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వి.రుక్కయ్య అన్నారు. నగరంలోని పలు రెస్టారెంట్లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనంతరావు మాట్లాడుతూ ఆహార భద్రత ప్రతి ఒక్కరి హక్కు అన్నారు. ఫిర్యాదులు ఏమన్నా ఉంటే బొమ్మూరులోని జిల్లా ఫుడ్ సేఫ్టీ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ఆహారం తయారుచేసే వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, టేస్టింగ్ సాల్ట్ వాడటం చట్టరీత్యా నేరమన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య మాట్లాడుతూ హోటళ్ల నుంచి ఆహార పదార్థాలను సేకరించామని, వాటిని ల్యాబ్‌కు పంపించి రిపోర్ట్ ఆధారంగా జాయింట్ కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ నాగలక్ష్మి, ఎన్‌ఓ ప్రభాకర్, ఫుడ్ సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంతతకు అందరూ సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై దుర్గాప్రసాద్

కడియం: గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొనేలా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కడియం ఎస్సై దుర్గాప్రసాద్ కోరారు. కడియపులంక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్సై దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు ప్రతి చిన్న విషయానికి గొడవలు పడవద్దని, స్థానికంగానే పరిష్కారం తీసుకోవాలని, ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలు జోలికి వెళ్లవద్దన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట రీత్యా కేసులు నమోదు చేస్తామన్నారు. సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి గ్రామంలోనూ శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

472 మందికి వైద్య పరీక్షలు



కడియపులంకలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కడియపులంక సచివాలయం -1 వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 472 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎస్.జెస్సీ సుప్రియ ఆధ్వర్యంలో డాక్టర్ సుప్రియ, గైనకాలజిస్టు జి.వరలక్ష్మి, అగర్వాల్ కంటి ఆసుపత్రి సిబ్బంది సేవలందించారు. ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ శిబిరాన్ని పర్యవేక్షించారు. 45 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి వెంకటలక్ష్మీదేవి పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 13 అర్జీలు



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వైద్య ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 13 అర్జీలు వచ్చాయని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. జీతాలకు సంబంధించి ఏడు, ఉద్యోగ వ్యక్తిగత సమస్యలపై రెండు, బదిలీల కోసం రెండు, స్టాఫ్ నర్సుల జీతాల పెంపు కోసం ఒకటి, ఉద్యోగ పదోన్నతికి సంబంధించి ఒక అర్జీ అందాయన్నారు. వీటిని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సత్య కుమార్ నల్లూరి, డాక్టర్ మౌనిక, డాక్టర్ షమ్మి కుమార్, సూపరింటెండెంట్లు సత్యనారాయణ, లక్ష్మణ్ మూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఎంపీ భరత్‌రామ్

- ఎంపీ భరత్ రామ్
- 21వ డివిజన్‌లో పర్యటన

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం చూసి, నచ్చితే తనకు ఓటు వేసి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అభ్యర్థించారు. ఆయన మంగళవారం స్థానిక 21వ డివిజన్‌లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి బండ్ రోడ్డును హైదరాబాద్ టాంక్ బండ్ రోడ్డు కన్నా అత్యద్భుతంగా అభివృద్ధి చేస్తానన్నారు. నగర వాసులకు 24 గంటలూ మంచినీటి సరఫరా అందిస్తానని తెలిపారు. ఎంపీగా గెలిచినప్పటికి నుంచీ నేటి వరకూ నిత్యం ఎక్కడో అక్కడ ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమాన్ని చేస్తూనే ఉన్నానన్నారు. రానున్న ఎన్నికలలో ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే సదా మీ సేవకుడిగా ఉంటూ నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో 21వ డివిజన్ ఇన్‌చార్జి ఏపీ రమణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ విషయాలపై పవన్ ఎందుకు మాట్లాడరు!



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి రాజు

ప్రకాశం నగర్: విశాఖపట్నం రైల్వే జోన్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఎందుకు మాట్లాడలేకపోతున్నారని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి రాజు ప్రశ్నించారు. ఆర్యాపురంలోని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కార్యాలయంలో మంగళవారం విలేకరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ టీడీపీతో పవన్ కల్యాణ్ పొత్తు పెట్టుకుని చంద్రబాబుకు కాపులను తాకట్టు పెట్టారని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందకపోవడానికి చంద్రబాబే కారణమని ఆరోపించారు. బీజేపీతో జత కట్టి ప్రత్యేక హోదా వద్దు ప్యాకేజీ ముద్దు అంటూ ఏపీ ప్రజల మనోభావాలను దెబ్బతీశారన్నారు. తెలంగాణలో టీఎస్‌పీఎస్ ప్రశ్నపత్రాల లీకేజీపై పవన్ కల్యాణ్ ఎందుకు ప్రశ్నించ లేదన్నారు. ఈ రోజు వరకూ కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభాన్ని ఎందుకు కలవలేదని ప్రశ్నించారు. సమావేశంలో లీగల్ సెల్ నాయకులు బీరా అరుణ్ కుమార్, సుమన్ పాల్, చెరుకూరి రామారావు చౌదరి పాల్గొన్నారు.

ఓబీసీ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు కృషి



రౌతు సూర్యప్రకాశరావుకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: తూర్పు కాపు సంఘీయులకు ఓబీసీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు హామీ ఇచ్చారు. అనపర్తి నియోజకవర్గం కొంకుదురు గ్రామానికి చెందిన తూర్పుకాపు విద్య, విజ్ఞాన అభివృద్ధి సంఘం సభ్యులు మంగళవారం స్థానిక రౌతు కార్యాలయంలో సూర్యప్రకాశరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రౌతు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న తూర్పుకాపు సంఘీయులకు మాత్రమే ఓబీసీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న ఆ సంఘీయులు ఓబీసీ ధ్రువీకరణకు నోచుకోని విషయాన్ని వైఎస్సార్ సీపీ ఎంపీల ద్వారా పలు మార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినట్లు గుర్తు చేశారు. ధ్రువీకరణ పత్రాలు దక్కని పరిస్థితిలో ఎంతో మంది తూర్పుకాపు యువత విద్య, ఉపాధి రంగాలలో రిజర్వేషన్ ఫలాలను అందుకోలేక పోతున్నారన్నారు. జాతీయ వెనుకబడిన తరగతుల కమిటీ (ఎన్‌సీబీసీ)లో స్థాయి సంఘం సభ్యుడిగా ఉన్న విజయ నగరం ఎంపీ చంద్ర శేఖర్‌కు ఈ విషయంపై విజ్ఞప్తి చేశానని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కొంకుదురులో తుది దశ నిర్మాణంలో ఉన్న తూర్పుకాపు విద్య, విజ్ఞాన అభివృద్ధి సంఘం కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రాజేష్, ఈశ్వర్, పోతు రాజు, కోన అర్జునుడు, ఎరువాడ శ్రీను, వై.ప్రసాద్ పాల్గొన్నారు.

అతిగా వండిన ఆహారంతో అనారోగ్యం

ప్రకాశం నగర్: అతిగా వండిన ఆహారం అనారోగ్యానికి కారణమవుతుందని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ అనిల్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ విభాగంలో జరుగుతున్న పాపులర్ లెక్చర్ సిరీస్ రెండోరోజు మంగళవారం కొనసాగింది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ పసుపులేటి.. వివిధ రకాల వ్యాధులు, వాటి మూలాలు అనే అంశంపై ప్రసంగించారు. అనేక రోగాలు మన ఆహారపు అలవాట్లు, ఆరోగ్య శైలి వంటి వాటిపై ఆధారపడి ఉంటాయన్నారు. అతిగా వండిన ఆహార పదార్థాలను తింటే కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. తద్వారా దీర్ఘకాలిక రోగాల బారిన పడతామన్నారు. పంటలపై రసాయన క్రిమిసంహారకాలను వాడటం మూలంగా మన శరీరంలో అనేక రోగాలు ప్రబలుతున్నాయని తెలిపారు. ప్రకృతి సేద్యం ద్వారా ఈ రోగాల బారి నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, బయోటెక్నాలజీ విభాగాధిపతి బి.నాగేశ్వరి, కార్యక్రమ సమన్వయకర్త కె.అనూష, అధ్యాపకురాలు ఐ.పర్ణిక సాయి పాల్గొన్నారు.

అమూల్ కేంద్రాలతో పాడి రైతులకు ప్రయోజనం



పాడి రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్ మనోజ్

కడియం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న అమూల్ పాల కేంద్రాల ద్వారా పాడి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ తెలిపారు. వేమగిరి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన పాడి రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మార్చి ఒకటి నుంచి కడియం మండలంలోని వేమగిరి, కడియం, జేగురుపాడు, కడియపులంక, మాధవరాయుడుపాలెం గ్రామాల్లో ఈ పాల కేంద్రాలు ప్రారంభిస్తారన్నారు. ప్రైవేటు పాలకేంద్రం కంటే ఇక్కడ రైతులకు గిట్టుబాటు ధర దక్కుతుందన్నారు. నాణ్యమైన పాలకు లీటర్ వంద రూపాయల వరకూ అందిస్తారన్నారు. ప్రతి పది రోజులకు రైతుల పాల డబ్బులు నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాలకు చెల్లించబడతాయన్నారు. ఆధునిక యంత్రాలతో పాల నాణ్యతను గుర్తించడం వల్ల పాడి రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. అలాగే ఈ పాలకేంద్రాల్లో పాలు పోసే పాడి రైతులకు పశువుల కొనుగోలు కోసం తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వడం వంటి సౌకర్యాలు కూడా కల్పిస్తారన్నారు. సమావేశంలో కడియం వెటర్నరీ ఏడీ జి.రవివర్మ, డీఆర్‌డీఏ రాజనగరం ఏరియా కో ఆర్డినేటర్ వై జనార్దన రావు, ఏపీఎం అప్పల కొండ, కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టర్ ఏపీఎస్ లక్ష్మి, మురమండ, జేగురుపాడు పశు వైద్యులు కృష్ణవేణి, జె.కిరణ్, సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ హయతి పాల్గొన్నారు.

వ్యాధులను గుర్తించడంలో అవగాహన అవసరం



వైద్య నిపుణులను సత్కరిస్తున్న పీఎంపీలు

రాజమహేంద్రవరం రూరల్: పల్లెల్లో ప్రాథమిక వైద్య సేవలు అందించే పీఎంపీలు వ్యాధులను గుర్తించడంలో అవగాహన పెంచుకోవాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ బలభద్ర వెంకటరాజు అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ - ప్రైమరీ హెల్త్ కేర్ (ప్రొవైడర్స్) వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో మంగళవారం హుకుంపేటలో రాజమండ్రి శాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఖాన్ అధ్యక్షతన వైద్య, విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరాలజిస్ట్ డాక్టర్ బలభద్ర వెంకటరాజు మాట్లాడుతూ మెదడు సంబంధిత వ్యాధులను ప్రాథమిక స్థాయిలో గుర్తించగలిగితే చికిత్స అందించడం సులభమన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన తొలి మూడు గంటల సమయంలో చికిత్స అందిస్తే, పక్షవాతం బారిన పడకుండా కాపాడవచ్చని అన్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ బలభద్ర రఘువీర్ మాట్లాడుతూ జీర్ణాశయ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్.వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత కూడా గుండెపోటుకు గురవడానికి కారణం వ్యాయామం లేకపోవడం, ఆహారపు అలవాట్లేనని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ పీఎంపీలు ఎప్పటికప్పుడు వైద్య విజ్ఞానం తెలుకోవడం వల్ల మేలైన వైద్య సేవలందించవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్ బాబు, ఎ.సురేష్ బాబు, సుంకర శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం వైద్య నిపుణులను సభ్యులు ఘనంగా సత్కరించారు.

ఒత్తిడిని అధిగమిస్తే సత్ఫలితాలు



డాక్టర్ కర్రి రామారెడ్డిని సత్కరిస్తున్న డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

రాజమహేంద్రవరం రూరల్: ఒత్తిడిని అధిగమించి సంతృప్తికరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని ప్రముఖ మానసిక వైద్యనిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. మంగళవారం బొమ్మూరు జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణాసంస్థ(డైట్)లో ఆయన ఛాత్రోపాధ్యాయులకు 'స్ట్రెస్ మేనేజ్మెంట్'పై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఒత్తిడి వల్ల కలిగే దుష్ఫలితాలను, ఒత్తిడిని అధిగమించి సంతృప్తికరమైన జీవనవిధానాన్ని ఎలా అలవరుచుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఆ అంశంపై ఛాత్రోపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో విద్యావికాస్ పరిషత్ కో ఆర్డినేటర్ జి.కోటేశ్వరరావు, సభ్యులు ఎం.సూర్యనారాయణ, దాట్ల వర్మ, ఇన్ చార్జి ప్రిన్సిపాల్ కేవీ సూర్యనారాయణ, అధ్యాపక సిబ్బంది జానకీదేవి, సత్యనారాయణ, గంగాధర్, బాలరాజు, వీరభద్రరావు, రామకృష్ణారావు, ఎస్తర్, కళావతి, రాజేష్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువతదే కీలకపాత్ర

రాజానగరం: దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె. పద్మరాజు అన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి లేనంతగా యువశక్తి భారతదేశానికి ఉందన్నారు. యూనివర్సిటీలోని సెమినార్ హాలులో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'యువ సంవాద్ - భారతదేశం 2047' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2047 నాటికి మన దేశం ఏ విధంగా అభివృద్ధి చెందాలని యువత భావిస్తోంది, అందుకు అనుగుణంగా ఎటువంటి లక్ష్యాలను ఎంచుకుంటుందనే విషయాలను తెలుసుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు చక్కటి వేదికలు అవుతాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన పంచ ప్రాణ్ సూత్రాలను యువత పాటిస్తే దేశాభివృద్ధి త్వరితగతిన జరుగుతుందన్నారు. బానిసత్వం, వలసవాద మనస్తత్వం వంటి జాడలను తొలగించడం, మన వారసత్వంపై గౌరవాన్ని పెంచుకోవడం, ఐక్యత, సంఘీభావం, పౌరులలో కర్తవ్యభావం వంటి ఐదు సూత్రాలు దేశాభివృద్ధికి ఎంతో అవసరమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలన దృక్పథం కలిగిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ఇటువంటి సమాజహితమైన, అభివృద్ధి ప్రణాళికలు వివరించడం ద్వారా భవిష్యత్తుకు బంగారుబాటలు వేయవచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు, సీడీసీ డీన్ ఆచార్య కేఎస్ రమేష్.. ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చర్ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం వక్తృత్వ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ప్రమాదం సుమా..





గోదావరిలో విహరిస్తూ నీటి అందాలను చూడడం అందరికీ ఇష్టమే. అయితే కనీస జాగ్రత్తలు తీసుకుని నదిలో విహరించాలి. అయితే రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద కొందరు మత్స్యకారులు తమ బోట్లలో పర్యాటకులను ప్రమాదకరంగా తిప్పుతున్నారు. కనీసం లైఫ్ జాకెట్లు కూడా లేకుండా పర్యాటకులు నదిలో విహరిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం ఏపీ టూరిజం బోర్డు అధికారులు వెళ్లిపోయిన తర్వాత ఈ విహారం జరుగుతోంది. దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగితే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది.

– ఫొటోలు : గరగ ప్రసాద్

కాతేరు పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఉదయం జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి (డీఈవో) కె.వాసుదేవరావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించి సూచనలు చేశారు. టీచర్‌గా మారి లెక్కలు బోధించారు. మధ్యాహ్న భోజన పథకంలో అందిస్తున్న రాగి జావ నాణ్యతను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు షరీనా పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన బీజాపూర్ రైతులు



సత్యదేవ నర్సరీలో బీజాపూర్ రైతుల బృందం

కడియం: కడియపులంకలోని పుల్లా చంటియ్యకు చెందిన శ్రీ సత్యదేవా నర్సరీని మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాకు చెందిన 75 మంది రైతుల బృందం సందర్శించింది. ఆ రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జైవిక్ ఖేతి మిషన్ అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ సంజయ్ మలాకర్ పర్యవేక్షణలో విచ్చేసిన ఈ బృందానికి నర్సరీ రైతు పుల్లా పెద సత్యనారాయణ స్వాగతం పలికారు. వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. మలాకర్ మాట్లాడుతూ దేశ, విదేశీ ఉద్యానవన సంపద ఒకేచోట నిక్షిప్తమైన ఏకైక ప్రదేశం కడియం ప్రాంతం అన్నారు. ఇక్కడ ఉన్న కొన్ని వేల రకాల మొక్క జాతులు, వాటి శాస్త్రీయ నామాలు గురించి క్షుణ్ణంగా తెలుసుకోవచ్చన్నారు. ఉద్యానవన శిక్షకులకు, రైతులకు ఈ ప్రదేశాలు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. అందుకే తాము ఏర్పాటు చేసే విజ్ఞాన పర్యటనల్లో తప్పనిసరిగా కడియం ప్రాంతాన్ని ఎంపిక చేస్తామన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

కడియం: వేమగిరి పంచాయతీ పరిధిలో కాలువగట్టుపై పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.9,500 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. నిందితులను కోర్టు ముందు హాజరు పరిచామన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మగ్గం వర్క్ శిక్షణ ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: మహిళలు మగ్గం వర్క్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వినయ్ సుంకర్ ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక జీవీ నగర్‌లోని శ్రీచక్ర అపార్ట్‌మెంట్‌లో వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మగ్గం వర్క్ శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల పెంపకంలో తల్లులు పాత్ర ఎక్కువ ఉంటుందన్నారు. వారికి ఏ రంగంపై ఆసక్తి ఉందో దాని వైపే ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి, ట్రైనర్ కోనే లక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు లక్ష్మీదేవి, నాగమణి, కుమారి, కిరణ్ సౌమ్య, మీనా పాల్గొన్నారు.

బీరు బాటిళ్ల స్వాధీనం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక గోదావరిగట్టు ఉల్లితోటవీధి సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కె.సోమేశ్వరరావు టూటౌన్ ఎస్సై వినోద్ అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి పది బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటుహక్కుపై అవగాహన కల్పించాలి

రాజానగరం: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు వజ్రాయుధమని, దానిని ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత అన్నారు. మండలంలోని దివాన్‌చెరువు, లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలలో గత ఎన్నికలలో తక్కువ శాతం పోలింగ్ జరిగిన ప్రాంతాలను మంగళవారం సాయంత్రం సందర్శించారు. సంబంధిత అధికారులతో బూత్‌ల వారీగా సమీక్షించారు. గత ఎన్నికలలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. రాజ్యాంగం కల్పించిన కల్పించిన ఓటు హక్కును సక్రమంగా వినియోగించడం పౌరుల బాధ్యత అన్నారు.